# అలివేలు పాట్లు

-ఆదుర్తి బాల

కాఫీకప్పు తెచ్చి చప్పుడు అయ్యేటట్టు టేబుల్ మీద పెట్టింది అలివేలు. చదువుతున్న పేపర్ లోంచి తలెత్తి ఓసారి భార్య వంక చూసి కాఫీ కప్పు అందుకున్నాడు కనకారావు. కాఫీ తాగి స్నానం చేసి తయారై వచ్చేసరికి వేడి వేడి ఇడ్లీలు, సాంబారు, అల్లం చట్నీతో బ్రేక్‌ఫాస్ట్ తయారుచేసి డైనింగ్ టేబుల్ మీద పెట్టింది.

అలివేలు తన ప్రక్కనే నిలబడి కొసరి కొసరి వడ్డిస్తుందేమో అని చూశాడు కనకారావు. కానీ ఆమె వచ్చే సూచన లేవీ కనిపించకపోవడంతో తనకు కావలసిన ఇడ్లీలు తనే వడ్డించుకుని తిని ఆఫీసుకి బయలుదేరాడు కనకారావు.

వెళ్ళొస్తానని గోడకి చెప్పినట్టుగా చెప్పి గుమ్మం దాటగానే ధడేలున తలుపులేసుకుంది. 'హూఁ చూద్దాం ఎన్నాళ్ళీ వంతం పడతావో!' అనుకున్నాడు కనకరావు.

* * *

అప్పటికి వారంరోజులుగా అలివేలు భర్తతో మౌనయుద్ధం చేస్తూనే ఉంది.

ఆరోజు అలివేలు ఫ్రెండ్ నాగలక్ష్మి, ఆమె భర్త సుందర్రావు వచ్చి అలివేలు దంపతులని గృహప్రవేశానికి రమ్మని మరీ మరీ చెప్పి వెళ్లారు. అలివేలుకీ, కనకారావుకీ ఇలాంటి ఫంక్షన్లకి, పెళ్ళిళ్లకి వెళ్లడం చాలా సరదా. నాగలక్ష్మి వాళ్లది సిటీ మధ్యలో కొత్తగా కట్టిన అపార్ట్‌మెంట్.

విశాలమైన హాలు, మార్బుల్ ఫ్లోరింగ్, అద్దాల షోకేసులూ, గోడనంతా ఆక్రమించుకున్న ఉడెన్ కప్‌బోర్డుల వంటి హంగులతో, అటాచ్డ్ బాత్‌రూం, గీజర్ వంటి సౌకర్యాలతో ముచ్చటగొలిపే తన ఫ్రెండు నాగలక్ష్మి ఇంటిని చూడగానే అలివేలు కళ్ళు చెదిరాయి. రాజుని చూసిన కళ్లతో మొగుడిని చూస్తే మొత్త బుద్ధి అయిందన్న నాటు సామెతలాగా తన ఫ్రెండు కొత్త ఇంటిని చూసిన అలివేలుకి ఊరి చివరగా ఏ హంగూ ఆర్భాటం లేని ఎప్పుడో మామగారితరంలో కట్టించిన పాత ఇల్లు అసలు నచ్చలేదు.

తన ఇంట్లో నాపరాళ్ళ గచ్చుని చూసినప్పుడల్లా నాగలక్ష్మి ఇంటి మార్బుల్ ఫ్లోరింగు గుర్తొచ్చేది.

రాత్రిళ్ళు బాత్‌రూంకి వెళ్లాల్సి వచ్చి పెరట్లో దూరంగా ఉన్న టాయిలెట్‌కి ఒకర్తీ వెళ్లాలంటే భయమేసి భర్తని తోడు రమ్మని నిద్రలేపేది అలివేలు. ఇదివరకూ ఈ అసౌకర్యాన్ని పట్టించుకోని అలివేలుకి అపార్ట్‌మెంట్ అయితే హాయిగా అటాచ్డ్ బాత్‌రూంకి ఎవరి సాయం అడక్కుండా వెళ్లచ్చు అనిపించేది. అదీగాక ఓ గిన్నెడు నీళ్ళు కావాలన్నా బావి దగ్గరకెళ్లి తోడుకుని తెచ్చుకోవాల్సిందే.

అదే నాగలక్ష్మి వాళ్ల ఇంట్లో అయితే వంటింట్లో, బాల్కనీలో, టాయిలెట్స్‌లో ఎక్కడా నీళ్ళు మోసుకెళ్ళే పనిలేకుండా ఎక్కడికక్కడ నీళ్ల టాప్‌లే. ఇవన్నీ ఆలోచించిన అలివేలుకి తను కూడా అలాంటి అపార్టుమెంట్లో ఎందుకు ఉండకూడదు అనిపించింది. భర్తతో తాము కూడా మంచి సెంటర్లో ఓ అపార్టుమెంట్ కొనుక్కుందామని ప్రపోజ్ చేసింది.

“చాల్లే ఊర్కో ఈ ఇల్లు మాకు అచ్చొచ్చింది. ఈ ఇంట్లోనే మా అక్కల పెళ్లిళ్ళు, పురుళ్ళూ అయి వాళ్లంతా పిల్లాపాపలతో హాయిగా ఉన్నారు. ఈ ఇల్లు వదిలే పనేలేదు'' అన్నాడు కనకారావు.

“ఈ ఇంట్లో సుఖం తక్కువ పనెక్కువ. నాలుగురకాల కూరగాయలు కొనుక్కోవాలన్నా, షాపింగ్ చేసుకోవాలన్నా ఏ బస్సో, రిక్షానో పట్టుకుని సిటీలోకి పోవాలి. పిల్లలందరూ ఉద్యోగాలంటూ వేరే ఊళ్లలో సెటిలైపోయారు. ఇక లంకంత ఈ కొంపలో ఉండేది మనిద్దరమే. అర్ధరాత్రి ఏ దొంగ వెధవ ఇంట్లో దూరినా మనల్ని ఆదుకునే నాధుడే లేడు. ఏమైనాసరే ఈ ఇల్లు మారదాము అనేవరకూ మీతో మాట్లాడే పనే లేదు'' శపథం చేసినట్టుగా అన్నది అలివేలు.

భార్య శపథాన్ని మొదట్లో అంత పట్టించుకోలేదు కనకారావు.

మౌనంగా ఉంటే ఏంలే టైంకి అన్నీ అమర్చిపెడుతోందిగా అనుకున్నాడు గానీ అస్తమానూ లొడలొడా వాగే కనకారావుకి భార్య అలా మూగదానిలా ఉండడం భరించడం కష్టమైపోయింది. భార్య పంతం, పట్టుదల తెలిసినవాడు కనుక ఇక తాను దిగిరాక తప్పదనిపించింది కనకారావుకి.

మంచి సెంటర్‌లో అపార్ట్‌మెంట్స్ అమ్మకానికి ఉన్నాయేమో ఎంక్వయిరీ చేశాడు.

“మా అపార్ట్‌మెంట్ అమ్మేస్తాను గురూ. నేను విఆర్‌యస్ తీసుకుని పిల్లల దగ్గరికెళ్లిపోదామనుకుంటున్నాను'' కనకారావు ఫ్రెండ్ అన్నాడు.

అప్పటివరకూ తను దాచుకున్న సేవింగ్స్‌కి ఎప్పుడో ఉద్యోగం వచ్చిన కొత్తల్లో ఊరి అవతల కొన్న స్థలం అమ్మగా వచ్చిన డబ్బు జతచేసి అదీ చాలకపోతే కొంత అప్పుచేసి ఎలాగైతేనేం తన ఫ్రెండ్ అపార్ట్‌మెంట్‌ని కొన్నాడు కనకారావు. ఇంటికి వెల్లవేయించి, కడిగించి కొత్త ఇల్లులా తయారుచేయించి ఇచ్చాడు కనకారావు ఫ్రెండ్. చాలారోజుల తర్వాత భార్య మొహంలో దీపావళి కనిపించింది కనకారావుకి.

వచ్చిన బంధుజనులంతా తమ అపార్ట్‌మెంట్ అందచందాలని పొగుడుతూ ఉంటే పొంగిపోయింది అలివేలు. అద్దాల షోకేసులనీ, మెరిసిపోయే తెల్లరాళ్ళ ఫ్లోరింగ్‌నీ చూసి మురిసిపోయింది. రకరకాల బొమ్మలు తెచ్చి షోకేసుని నింపేసింది. ఎవరో కాలింగ్‌బెల్లు కొడుతూంటే గబగబా తలుపు తీయాలనే తొందరలో నేలమీద నీళ్ళు చూసుకోక జారిపడింది అలివేలు.

“ఈ నేలమీద జాగ్రత్తగా నడవాలి. మన పాతింట్లోలాగా విసవిస నడిస్తే సరిపోదు'' భార్యని లేవదీస్తూ అన్నాడు కనకారావు.

బెణికిన కాలు బాధ భరిస్తూనే ఇంటిపనులు చేసుకుంది అలివేలు.

“అమ్మగారూ మీకూ పనిచెయ్యమంటారా?'' ఎదురు వాటాలో చేసే పనమ్మాయి అడిగిందో రోజున.

ఆ ఫ్లోర్‌లో అందరి ఇళ్ళూ ఆమే చేస్తుందట. ఆ సంగతి కూడా ఆ అమ్మాయే చెప్పింది. ఇంట్లో పనిచేసుకోవడం అలవాటున్నా అందరికీ పనమ్మాయి ఉండి తనకొక్కర్తికే లేకపోవడం నామోషీ అనిపించింది అలివేలుకి.

మర్నాటి నుంచి పనికి రమ్మంది. “ఉండేది ఇద్దరం...పనమ్మాయి ఎందుకూ అదనపు ఖర్చు కాకపోతే'' అంటూ విసుక్కున్నాడు కనకారావు. నలుగురితోపాటే మనమూనూ అంది అలివేలు.

భర్త ఆఫీసుకి, పిల్లలు స్కూళ్లకీ వెళ్లాక ఇళ్ళల్లో

ఉండే ఆడవాళ్లందరూ కూర్చుని కబుర్లు చెప్పుకు నేవారు. తనకి తోచనప్పుడు అలివేలు కూడా వెళ్లి వాళ్లతో కబుర్లు చెప్తూ కూర్చునేది.

"పాతింట్లో అయితే పిలిస్తే పలికే వారే ఉండే వారు కాదు. ఇక్కడ చూడండి ఎంత బాగా కాల క్షేపం అవుతోందో'' భర్తకి టిఫిన్ పెడుతూ అంది అలివేలు.

"అతిసర్వత్ర వర్జయేత్ అన్నారు. విలువైన క్షాలాన్ని కబుర్లతో చంపేయకు'' అన్నాడు కనకా రావు.

"నాకూ టైం విలువ తెలుసులెండి. రోజూ వెడ తానా ఏమిటి? ఎప్పుడో తోచనప్పుడు కాసేపు కూర్చుని వస్తాను. ఇరుగుపొరుగుతో ఆ మాత్రం సత్సంబంధాలు లేకపోతే ఎలా?'' అంది తనని సమర్ధించుకుంటూ అలివేలు.

భర్తతో అలా అన్నదే కానీ ఆ కబుర్లు తనకీ అల వాటై రోజూ వెళ్లకపోతే తోచేది కాదు అలివేలుకి.

★ ★ ★

నాలుగురోజులుగా పనమ్మాయి రావట్లేదు. గుట్టలుగా పడి ఉన్న మాసిపోయిన బట్టల్ని ఉత కడం మొదలుపెట్టింది అలివేలు. అన్నీ శుభ్రంగా ఉతికి ఆరేసి ఐదు నిముషాలైందో లేదో కాలింగ్ బెల్ మోగింది. అన్ని బట్టలు ఆడించి ఆరేయడం వల్ల నడుం పట్టుకుపోయిన అలివేలు ఓ చేత్తో నడుం పట్టుకుని నిదానంగా నడిచి వెళ్లి తలుపు తీసింది. ఎదురుగా భద్రకాళిలా నిలుచుంది కింది ఫ్లోర్‌లో ఉండే ఆవిడ.

"మీరు ఆరేసిన బట్టల్నించి నీళ్ళు కారి బాల్కనీలో నేను ఎండబెట్టుకున్న మిరపకాయలు తడిసి పోయాయి. బట్టలు ఆరేసేటప్పుడు బాగా పిండి నీళ్ళు కారకుండా ఆరేసుకోండి'' అంటూ సీరియస్‌గా వార్నింగ్ ఇచ్చింది.

ఆవిడ గొంతు విని ఇరుగు పొరుగు ఆడవాళ్ళు బైటికొచ్చారు.

అందరి ముందూ మాట పడాల్సి వచ్చినందుకు బాధతో లోపలికెళ్లిపో యింది అలివేలు. వట్టిగా అయితే పోచి కోలు కబుర్లు చెప్పే ఇరుగుపొరుగూ ఆడవాళ్ళూ ఆవిడకి సర్దిచెప్పే ప్రయత్నమైనా చేయకుండా తమకెందుకు అన్నట్టు వెళ్లిపోయారు. మరోసారి కరెంట్ పోయిం దని మిక్సీలో చేద్దామనుకున్న పచ్చడి రోట్లో దంచుతోంది అలివేలు.

ఆ కింది ఆవిడ మళ్ళీ పరిగెత్తుకొచ్చింది కొంప లంటుకున్నట్టు "మా వారు నైట్‌డ్యూటీ చేసొచ్చి నిద్రపోతున్నారు. అలా చప్పుళ్ళు చేసి డిస్టర్బ్ చేయకండి'' అంది కోపంగా ఆవిడ.

"మరి కరెంట్ పోతే నన్నేం చేయమంటారు? మీకు డిస్టర్‌బెన్స్ అవుతుందని కరెంట్ వచ్చేవరకూ చట్నీ చేయడం మానుకోవాలా?'' ఆవిడ అన్న



మాటలకు తేరుకుంటూ తనూ సీరియస్‌గానే అంది అలివేలు.

"ఇది అపార్ట్‌మెంట్. ఇక్కడ మనం ఏ పనిచేసినా క్రిందివాళ్ళకీ, చుట్టు ప్రక్కల వాళ్ళకీ అసౌకర్యం కలుగకుండా చూసుకోవాలి. లేకపోతే అందరం ఓచోట కలిసుండలేం. అపార్ట్‌మెంట్స్‌లో ఉన్నామంటే ఇలాంటివాటికి ఒప్పుకున్నట్టే" అన్నదావిడ. అలివేలు ఏదో మాట్లాడేంతలో కనకారావు వచ్చాడు.

"సారీ మేడమ్! ఇంకెప్పుడూ ఇలా మిమ్మల్ని అసౌకర్యానికి గురిచెయ్యం" అంటూ ఆవిడకి సర్దిచెప్పి పంపించేశాడు.

"అదేంటండీ మనింట్లో మనం పనిచేసుకోవడం కూడా తప్పేనా" కోపంగా అంది అలివేలు.


"ఆవిడ అన్నదాంట్లో తప్పేముంది? ఇక్కడ ఇలాంటి అడ్జెస్ట్‌మెంట్లు తప్పవు. పైగా వాళ్లాయన ఈ అపార్టుమెంట్స్ సభ్యులు ఎన్నుకున్న అసోసియేషన్ ప్రెసిడెంట్. వాళ్లతో వాదనలెందుకు" అన్నాడు కనకారావు.

"ఏం ఇల్లో గట్టిగా నడిచినా తప్పేమో. ఇంతకన్నా పాత ఇల్లే నయం ఎక్కడ కూర్చున్నా, చప్పుళ్ళు చేసినా మహారాణిలా చెయ్యచ్చు" అప్రయత్నంగానే అనుకుంది అలివేలు.



## ఆసక్తి

హిందీలో వచ్చిన 'లగే రహో మున్నాభాయ్'ని తెలుగులో 'శంకర్ దాదా జిందాబాద్'గా నిర్మిస్తున్న సంగతి తెలిసిందే! ఇందులో హీరో చిరంజీవి అయితే, దర్శకుడిగా ప్రభుదేవాని అనుకుంటున్నట్టు టాలీవుడ్ వర్గాలు కథనం. అలాగే హిందీలో నటించిన విద్యాబాలన్‌నే తెలుగులో కూడా హీరోయిన్‌గా తీసుకోవాలనుకుంటున్నారట. నిర్మాణానికి ఇలా వార్తల్లోకి వస్తున్న 'శంకర్‌దాదా జిందాబాద్' కోసం ప్రేక్షకుల్లో ఆసక్తి పెరగడం చాలా సహజం.




* * *

"ఏమండీ! మా అక్కావాళ్ళు వస్తున్నారుట రేపు. ఫోన్ చేశారు" ఆనందంగా అంది అలివేలు.

"ఇప్పుడెందుకు వస్తున్నారు? ఏదైనా పనుందా ఈ ఊళ్ళో" అన్నాడు కనకారావు.

"పనుంటేనే రావాలా ఏమిటి? మన గృహప్రవేశానికి రావడం కుదర్లేదని ఇప్పుడు ఊరికే చూసి పోదామని వస్తున్నారు. మీరు రేపు ఆఫీసుకి సెలవు పెట్టి ఇంటి పట్టునుండండి. అందరం సరదాగా గడపొచ్చు" అన్న అలివేలు మాటలకి "సరేలే ఇంతకీ ఇంట్లో సరుకులూ కూరగాయలూ సరిపడా ఉన్నాయా లేవా? తీరా వాళ్ళొచ్చాకా అవి తెండి, ఇవి తెండి అని సంచి నా చేతికి ఇచ్చి బజారుకు పంపిస్తావు" అన్నాడు కనకారావు.

"ఇదేమీ పాతిల్లు కాదు అన్నీ మీరు తెచ్చి పెట్టడానికి. చుట్టూ బోల్డన్ని షాపులు. నాక్కావలసినవేవో నేనే తెచ్చుకోగలను" అంది అలివేలు.

"పోనీలే నాకు బజారు పని తప్పించావు" తేలికగా ఊపిరి పీల్చుకుంటూ అన్నాడు కనకారావు.

ఖరీదైన గద్వాల్ చీర కట్టుకుని అట్టహాసంగా తయ్యారై అక్కా బావలని రిసీవ్ చేసుకోవడానికి భర్తతో కలిసి రైల్వే స్టేషన్‌కి వెళ్లింది అలివేలు. ఇంటికి రాగానే అక్కా బావలకి ఇల్లంతా చూపించింది.

"మీ ఇల్లు షోకేస్‌లో పెట్టిన బొమ్మరిల్లులా మెరిసిపోతోందే అలివేలూ. మీరుండేది మూడో అంతస్తులో కాబట్టి కావలసినంత గాలీ, వెలుతురూనూ" అంది అలివేలు అక్క మంగతాయారు.

"ఔనే అసలిన్నాళ్ళూ ఆ పాతింట్లో ఉన్నావా అనిపిస్తుందిప్పుడు" అంది అలివేలు అక్కమాటలకి పొంగిపోతూ.

కాసేపు కబుర్లు అయ్యాక "ఇంక స్నానం చేసి కాసేపు రిలాక్స్ అవుతానే అలివేలూ. రాత్రంతా ప్రయాణం కదా బడలికగా ఉంది" అంది మంగతాయారు.

"అలాగే నువ్వు స్నానం చేసిరా. ఈలోగా జీడిపప్పు ఉప్మా చేస్తా" గొప్పగా అంది అలివేలు.

బాత్‌రూంలోంచి అక్క కేక వినిబడుతూనే "ఏమైందే అక్కా! ఏంకావాలి?" అంది అలివేలు. "నీళ్ళు రావట్లేదే!" అంది మంగతాయారు.

"అంతేకదా వాచ్‌మాన్‌తో మోటారు వెయ్యమని చెప్తాలే. ఓ పదినిముషాల్లో నీళ్ళొస్తాయి" అక్కకి భరోసా ఇచ్చింది అలివేలు.

"ఏం రాంబాబూ ట్యాంకులో నీళ్ళు అయిపోతే చూసుకోవద్దూ. జీతం తీసుకునేటప్పుడు పని కూడా కరెక్టుగా ఉండాలి" దబాయింపు ధోరణిలో వాచ్‌మాన్‌ని హెచ్చరించింది అలివేలు.

"మోటారు పాడయితే నన్నేం చేయమంటారమ్మా" విసుగ్గా అన్నాడు రాంబాబు.

"ఎప్పుడు బాగవుతుంది? ఎవరైనా వెళ్లారా లేదా మెకానిక్కుని తీసుకురావడానికి"

"నీళ్ల ఇబ్బంది మీ ఒక్కరికే కాదుగా అమ్మా. వాళ్ళిద్దరూ ఎప్పట్నించో చూస్తున్నారు నీళ్లకోసం" అన్నాడు వాచ్‌మెన్ సెల్లార్‌లో అసహనంగా తిరుగుతున్న మనుషుల వంక చూపించి.

అంటే నీళ్లయిపోయి చాలాసేపయిందన్నమాట. అక్కతో కబుర్లలో పడి తను గమనించలేదు అనుకున్న అలివేలుకి బాత్‌రూంలో నీళ్ల కోసం వెయిట్ చేస్తున్న అక్క గుర్తొచ్చి వరుగుతీసింది.

ఎందుకైనా ఉంటాయని పొద్దున్న తను పట్టి ఉంచిన రెండు బక్కెట్ల నీళ్లల్లో

ఒక బక్కెట్ అక్కకిచ్చింది.

ఇంట్లో ఇంకా వంటకి నీళ్ళు కావాలి, బావగారి స్నానం కానేలేదు. రాత్రి పడేసిన ఎంగిలి కంచాలు, గిన్నెలూ సింక్‌లో ఉన్నాయి. పనమ్మాయి వచ్చేస రికైనా నీళ్ళొస్తాయా అనుకున్న అలివేలుకి గుండె గుభేలుమంది.ఇదే పాత ఇల్లైతేనా బావినిండా బోలెడునీళ్ళు. నీళ్ల కోసం టెన్షన్ పడే అవసరమే లేదు. మళ్లీ పాతిల్లు గుర్తొచ్చింది అలివేలుకి.

"నీళ్లు లేకపోతే టిఫిన్ ఎలా చేస్తావు. నేను హోటల్ నించి అందరికీ దోసెలు పార్శిల్ చేయించి పట్టుకొస్తాలే" అన్నాడు కనకారావు.

హోటల్ టిఫిన్ తిని తలా అరగ్లాసెడు నీళ్లతో చేతులు కడుక్కున్నారం దరూ. టిఫిన్ తిని కిందకెళ్ళొచ్చిన కనకారావు నవ్వు మొహంతో తిరిగొ చ్చాడు.

"మోటారు బాగైంది. ఇప్పుడే మోటార్ ఆన్ చేశాడు వాచ్‌మెన్. పదినిము షాల్లో నీళ్ళొస్తాయి" అన్నాడు.

"హమ్మయ్య. ఎలాగో టిఫిన్లు తినేశాంగా నీళ్ళు రాగానే వంట మొదలుపె డతాను"అంది అలివేలు.

★ ★ ★

టాప్‌లోంచి సన్నగా నీళ్లు రావడం మొదలవగానే అలివేలు ప్రాణం కుదు టపడింది. పనమ్మాయి వచ్చి గిన్నెలు తోమడం మొదలుపెట్టింది. సగం గిన్నెలు కడగగానే మళ్లీ నీళ్ళాగిపోయాయి. 'మళ్ళీ ఏమొచ్చిందో...' అను కుంటూ విసుగ్గా హాల్లోకి వచ్చింది అలివేలు. హాల్లో న్యూస్‌పేపర్‌తో విసురు కుంటూ కనిపించారు కనకారావు, అక్కా బావలు.

"కరెంట్ పోయిందే అలివేలూ" అంది మంగతాయారు.

"ట్యాంకులో కాసిని నీళ్ళు పడగానే కరెంట్ పోయిందన్నమాట. మళ్లీ నీళ్ళె ప్పటికి వస్తాయో, వంటెప్పుడు చేస్తానో" నిట్టూర్చింది అలివేలు.

"పవర్‌లైన్లు బాగుచేస్తున్నారుట. ఇప్పట్లో కరెంట్ రాదు" చావు కబురు చల్లగా చెప్పాడు కనకారావు.

"మరిప్పుడు వంటావార్పు ఎలా?" అంది అలివేలు.

"ఏముందీ కాసేపు చూసి అందరం హోటల్‌కి పోదాంలే" అన్నాడు కనకా రావు.

"రాక రాక అక్కావాళ్ళొస్తే ఈ ఇబ్బందులేమిటండీ" అంది అలివేలు భర్తతో.

"చూడమ్మా అలివేలూ. ఈ ఇబ్బందులు నీకు కొత్తగానీ మాకు అలవాటే. మీకు ఇంకా ఇంట్లోకి గాలి, వెలుతురూ వస్తోంది. మా అపార్ట్‌మెంట్స్‌లో ఉండే వాళ్లకి ఆ భాగ్యం కూడా లేదు. మా అపార్ట్‌మెంట్స్ బిల్డింగుకి ఇటూ అటూ కూడా ఇంకా ఎత్తుగా అపార్ట్‌మెంట్స్ కట్టారు. మాకు సూర్యచంద్రులు కనిపిం చరు. కరెంట్‌పోతే ఆ గదుల్లో ఉక్కపోత భరించలేం. విడిగా స్థలం కొని ఇల్లు కట్టే స్థోమత లేక మేం అక్కడ ఉంటున్నాం గానీ మీలా మా పెద్దలు కట్టించిన పాతతరం ఇల్లుంటే అది మట్టి ఇల్లని ఎంత మాత్రం వదిలేవాళ్లం కాదు" అన్నాడు అలివేలు బావగారు.

"మా అపార్ట్‌మెంట్ పక్కన కూడా కొత్తగా అపార్ట్‌మెంట్స్ కడతారుట" అన్నాడు కనకారావు.

"నిజమా" భర్త వంక ఆశ్చర్యంగా చూస్తూ అంది అలివేలు.

"నిజమే. ఈ గాలి, వెలుతురు ఒక్క ఏడాదిపాటే అనుభవించగలం మనం. వచ్చే ఏడాదికి ఈ హాల్లోకి లైటు వేసుకుంటేగానీ వెలుగురాదు. ఫ్యాను వేసు కుంటేగానీ గాలి రాదు" అన్నాడు కనకారావు.

ఆరాత్రి డబుల్‌కాట్ మీద నిద్రపట్టక దొర్లుతున్న అలివేలుకి పాతమట్టి ఇల్లు గుర్తొచ్చింది. వేసవి వడగాల్పుల నుంచి రక్షించి శరీరానికి ఆరోగ్యాన్ని, చల్లటి గాలిని అందించే వేపచెట్టూ, మామిడిచెట్టూ గుర్తొచ్చాయి. ఆరుబయట పడు కుంటే కొబ్బరాకుల సందుల్లోంచి తొంగిచూసే చందమామ గుర్తొచ్చాడు. ఉషోదయం తోటే రెక్కలు విప్పుకుని నవ్వుతూ పలకరించే పూల మొక్కలు గుర్తొచ్చాయి.

అవన్నీ రోజూ చూసే దృశ్యాలే అయినా ఎప్పుడూ మొహం మొత్తలేదు తనకి.

ప్లాస్టిక్‌పువ్వులాంటి ఈ అపార్టుమెంట్ మొదట్లో ఆకర్షించినంతగా తనని ప్పుడు ఆకర్షించడం లేదు.

'తనకీ ఇల్లొద్దు, మట్టి ఇల్లైనా ఆ ఇల్లే బాగుంది. సాధ్యమైనంత త్వరలో ఆ ఇంటికెళ్లిపోవాలి' అని నిశ్చయించుకుని హాయిగా నిద్రపోయింది అలివేలు.

భార్యనోట ఆ మాట ఎప్పుడొస్తుందా అని ఎదురుచూస్తున్న కనకారావు తన అపార్ట్‌మెంట్ అద్దెకిచ్చి పాత ఇంటికి మారిపోవాలనుకున్నాడు అలివేలు ప్రపోజల్ వినగానే.

★

## చైనాలో భారతం

గత సంవత్సరం మహాభారతాన్ని చైనీస్‌లోకి అనువదించి ఆరు సంపు టాల్లో విడుదల చేస్తే కొన్ని నెలల్లో ఆ ప్రతులన్నీ అమ్ముడైపోయి సంచ లనం సృష్టించాయిట. మళ్లీ రీప్రింటు చేయాల్సి వచ్చింది. చాలాకాలంగా పాశ్చాత్య సాహిత్యానికి, సంస్కృతికి ప్రాధాన్యత ఇచ్చిన చైనీస్ పండితు లకి ఇటీవల భారతీయ సాహిత్యం, సంస్కృతుల మీద ఉత్సుకత పెరగ డంతో బీజింగ్ యూనివర్సిటీలోని ఐదుగురు ప్రముఖ సాహితీవేత్తలు ఈ అనువాదాన్ని చేపట్టారుట!

## చాక్లెట్ గుండెకి మంచిది

చాక్లెట్లు ఎక్కువగా తింటే పళ్లు పాడైపోతాయని మనం పిల్లల్ని హెచ్చ రిస్తామేగానీ రోజుకో చాక్లెట్ తింటే పెద్దవాళ్ల గుండెలకి మంచిదంటున్నారు జాన్స్ హాప్కిన్స్ యూనివర్శిటీ రీసెర్చ్ నిపుణులు. ఏస్పరిన్ మాత్రలాగానే రక్తంలో గడ్డలు కట్టకుండా చేస్తుందిట చాక్లెట్. దాంట్లో వాడే కోకో గింజల వల్ల రసాయనక్రియ జరిగి రక్తంలో గడ్డలు కరుగుతాయి. గుండె జబ్బుల కుటుంబ చరిత్ర ఉన్నవారిని 1200 మందిని పరీక్ష చేసాక ఈ నిర్ధారణకి వచ్చామని నిపుణులు అంటున్నారు.

-విమలారామం

